క్లుప్తంగా

వెయ్యి యూనిట్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న మల్లయ్య

చిట్యాల: దళితబంధు పథకం ప్రతీ మండలానికి వెయ్యి యూనిట్లు ఇవ్వాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్ల మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని నియోజకవర్గంలో పదకొండు వందల మందికి మాత్రమే ఇవ్వాలనుకోవడం సరికాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి దళితులపై ప్రేమ ఉంటే అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు వివిధ సంక్షేమ పథకాలను ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎవైఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బావి మోటారు చోరీ

టేకుమట్ల(రేగొండ): గుర్తు తెలియని వ్యక్తులు బావి మోటారును చోరీ చేసిన సంఘటన రేగొండ మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద శనివారం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు వైనాల మహేందర్ కథనం ప్రకారం రేగొండ తిరుమలగిరి ప్రధాన రోడ్డు వెంట గల ఎస్సారెస్పీ కెనాల్ వద్ద గల వ్యవసాయ భూమికి నీరందించేందుకు కెనాల్‌కు మోటార్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ మోటార్‌ను అపహరించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ మోటార్ చోరీపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

గుడుంబా స్వాధీనం



టేకుమట్ల(రేగొండ): మండలంలోని నారాయణపూర్ శివారులో ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు శనివారం గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై మాన్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలంలోని నారాయణపూర్ నుంచి బానోతు వీరునాయక్, కైకా అనే వ్యక్తులు ద్విచక్ర వాహనంపై రేగొండకు గుడుంబాను తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 8లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ రఘుపతి, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, విష్ణు, విజయ్‌కుమార్ ఉన్నారు.

ఇసుక క్వారీలో పడి వ్యక్తి మృతి


కొమురయ్య (ఫైల్)

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లికి చెందిన వ్యక్తి ఇసుక క్వారీలో పడి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం వెంకట్రావుపల్లికి చెందిన బండి కొమురయ్య(50) ఉపాధి కోసం పెద్దపల్లి జిల్లా, కాల్వశ్రీరాంపూర్ మండలంలోని రాతిపెల్లి గ్రామంలో కొన్ని రోజులుగా కూలీ పని చేసుకుంటూ జీవించేవాడని తెలిపారు. కాగా స్వగ్రామమైన వెంకట్రావుపల్లికి భార్య లచ్చమ్మ, మనుమరాలితో వస్తున్న క్రమంలో కాల్వశ్రీరాంపూర్ మండలం, కిష్టంపేట శివారులోని ఇసుక క్వారీ గుంతలోని నీటినిలో స్నానం చేసేందుకు కొమురయ్య తన మనుమరాలుతో దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో కొమురయ్య భార్య లచ్చమ్మ తన మనుమరాలిని వెనక్కి లాగింది. నీటిలోకి దిగిన కొమురయ్య మునిగి మృతి చెందినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు..



మల్హర్: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నతూండ్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నతూండ్ల గ్రామానికి చెందిన పులిగంటి రాజశేఖర్ దుక్కిటెద్దు పచ్చిక మేయాడానికి గ్రామంలోని శివారుకు వెళ్లిందని తెలిపారు. పచ్చిక మేస్తున్న క్రమంలో కిందికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుత్ షాక్ గురై మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఎద్దు విలువ రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి


భూపాలపల్లి అర్బన్: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


టేకుమట్లలో..

భూపాలపల్లి అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. వైఎస్సార్ జయంతిని శనివారం కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, దేవన్, కరుణాకర్, శ్రీనివాస్, రాజిరెడ్డి, మహేందర్, రంజిత్, రజినీకాంత్ పాల్గొన్నారు.

ఇడుపులపాయలో నివాళులర్పించిన కిషన్

వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని కడప జిల్లా ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి కిషన్ నివాళులర్పించారు.

టేకుమట్ల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి, స్వీట్లు పంచారు. అనంతరం సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలుగు జాతి ఉన్నంత కాలం ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి అని వైఎస్సార్ అని కొనియాడారు. దేశంలో సంక్షేమ పథకాల విప్లవానికి నాంది పలికిన మహనీయుడన్నారు. 108, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ, సబ్సిడీ రుణాలు, నిరుద్యోగ విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య, ఇందిరమ్మ ఇళ్ల వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి కొనసాగించిన ఘనత కేవలం వైఎస్సార్‌కే సాధ్యమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొల్లికొండ చిన్నరాజయ్య, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి భూపెల్లి రవీందర్, మండల నాయకులు గోనెపెల్లి సంపత్, అల్లం ఓదెలు, దయాకర్, మహేష్, రమేష్ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి అర్బన్: వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న అప్పం కిషన్

హెల్మెట్ తప్పనిసరి ధరించాలి


వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై రమేష్

చిట్యాల: ప్రతీ దిచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై జంగిలి రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ వాహనాన్ని ఆపి వారికి పలు సూచనలు చేసి క్రమం తప్పకుండా అనుమతి పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. పత్రాలు సరిగా లేని పది మందికి జరిమానా విధించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, తదితరులు ఉన్నారు.

ఎంపిక చేసిన వారిని తొలగించడం సరికాదు


మాట్లాడుతున్న మారెపెల్లి మల్లేష్

టేకుమట్ల: కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావేంజర్ నియామకాల్లో ఎంపిక చేసిన అర్హులైన అభ్యర్థులను తొలగించే ప్రయత్నం చేయడం సరికాదని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం కేజీబీవీలలో ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కాగా, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్‌ఓలు అభ్యర్థుల నివేదికను కలెక్టర్, డీఈఓలు పంపించగా ఇంటర్వ్యూల ఆధారంగా పారదర్శకంగా పోస్టులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఎంపిక చేసిన వారిని పాఠశాలలో వారం రోజుల పాటు పని చేపించుకుని ఇప్పుడు కాదనడం సరికాదన్నారు. నియోజకవర్గంలో రాజకీయ నాయకుల జోక్యంతో వారిని తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని, అది పూర్తిగా ప్రభుత్వ నియమావళికి విరుద్ధమని అన్నారు. ఎమ్మెల్యే కార్యకర్తలకే ఈ పోస్టులను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సేవ చేయాల్సిన నాయకులే ఓట్ల రాజకీయాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ నియమించిన వారినే విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్, కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

పోడు రైతులను దగా చేస్తున్న కేసీఆర్


మాట్లాడుతున్న పీక కిరణ్

కాటారం: పోడు సేద్యం చేసుకొంటున్న రైతులకు 11 లక్షల ఎకరాలకు పట్టాలిస్తామని అసెంబ్లీలో చెప్పిన సీఎం కేసీఆర్ కేవలం నాలుగున్నర లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలు ఇచ్చి దగా చేశారని ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు ఆరోపించారు. కాటారం మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల తాయిలాలలో భాగంగా కొద్ది మంది పోడు రైతులకు మాత్రమే తూతూ మంత్రంగా పట్టాలు ఇచ్చిందని అన్నారు. మెజారిటీ పోడు రైతులను వారి పోడు భూముల్లో నుంచి వెళ్లగొట్టడానికి కేసీఆర్ ప్రభుత్వం కుట్రపన్నుతోందని విమర్శించారు. పట్టాలు రాని వారందరూ భూములు వదిలి వెళ్లాలని ఇప్పటికే అటవీశాఖ అధికారులు పోడు సాగు రైతులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు కొందరు పోడు రైతులకు పట్టాలు ఇప్పిస్తామని పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు బుర్రి కుమారస్వామి, శంకర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


చిట్యాల: మాట్లాడుతున్న సత్యనారాయణరావు


మహాముత్తారం: సమ్మెలో పాల్గొన్న సిబ్బంది

చిట్యాల: గ్రామాలను అద్దంలాగా తయారు చేసి ప్రజలు ఎలాంటి రోగాల బారిన పడకుండా వారి ప్రాణాలను కాపాడుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీసీసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న సమ్మె మూడో రోజుకు చేరింది. వారికి మద్దతుగా సత్యనారాయణరావు సమ్మెలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 50వేల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 51ను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా, మండల నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ సమ్మయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన సమ్మె

మహాముత్తారం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె మూడవ రోజు కొనసాగింది. శనివారం మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెలో మండలంలోని పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఫసీయుద్దీన్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల అడ్డగింత


సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న పంచాయతీ సిబ్బంది

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను గ్రామ పంచాయతీ సిబ్బంది శనివారం అడ్డుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు సమ్మెబాట పట్టిన విషయం తెలిసిందే. కాగా, గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో జిల్లా అధికారులు ప్రత్యామ్నాయ్య చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తాడిచర్ల గ్రామంలో అధికారులు ఇతర వ్యక్తులతో పారిశుద్ధ్య పనులు చేస్తున్న క్రమంలో పంచాయతీ కార్మికులు అక్కడికి చేరుకొని సామగ్రిని స్వాధీనం చేసుకొని, పనులను నిలిపేశారు. తమకు సమ్మెకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారోబార్, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

'ముందస్తు అరెస్టులు పిరికి చర్య'

ములుగు: నగరంలో ప్రధానమంత్రి మోదీ పర్యటన సందర్భంగా ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం పిరిచి చర్య అని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలు పోలీస్‌లు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం హేయమైన చర్య అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్ ఉన్నారు.

ములుగు రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం హేయమైన చర్యని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంనాయక్, ఎల్లారెడ్డి ఉన్నారు.

వెంకటాపురం(ఎం): దేశ ప్రధాని నరేంద్రమోదీ వరంగల్ జిల్లా పర్యటన నేపథ్యంలో మండలంలోని వివిధ పార్టీల నేతలను శనివారం ఉదయం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోఠితో పాటు కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్, రవి ఉన్నారు.

సంకల్ప సభకు తరలిన నాయకులు


చిట్యాల: సభకు తరలివెళ్తున్న నాయకులు


కాటారంలో..


భూపాలపల్లి రూరల్: సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు

భూపాలపల్లి రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హనుమకొండలో శనివారం నిర్వహించిన సంకల్ప సభకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కన్నం యగేందర్ ఆదేశాల మేరకు భూపాలపల్లి నుంచి నాయకులు తరలివెళ్లినట్లు అర్బన్ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. వెళ్లిన వారిలో అర్బన్ ప్రధాన కార్యదర్శి ఎరుకల గణపతి, తుమ్మేటి రాంరెడ్డి, తోట ఓదెలు, మనోహర్‌రెడ్డి, సుధాకర్, కడారి మాలతి, బూర పద్మ, బట్టు రవి, దొంగల రాజేందర్, తదితరులు ఉన్నారు.

కాటారం: వరంగల్‌లో ప్రధాని నరేంద్రమోదీ విజయ సంకల్ప సభకు మండలంలోని బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు వాహనాల్లో సుమారు వంద మంది నాయకులు సభకు వెళ్లారు. అంతకుముందు కాటారంలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. సభకు తరలివెళ్లిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి గంట అంకయ్య, మండల ఉపాధ్యక్షుడు పర్తిరెడ్డి హన్మయ్య, జిల్లాల శ్రీశైలం, బీసుల ఎర్రయ్య, బొంతల రవి, ఆలెం లక్ష్మీనారాయణ, నాగరాజు తదితరులు ఉన్నారు.

చిట్యాల: వరంగల్‌లో జరిగే విజయసంకల్ప మహాసభకు భారత ప్రధాని నరేంద్రమోదీ వస్తున్న నేపథ్యంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు.

క్యాంపు నుంచి తిరిగివచ్చిన ఎంపీటీసీ

మహదేవపూర్: ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం కోసం ఆరుగురు ఎంపీటీసీలు ఆర్డీఓకు సంతకాలతో కూడిన తీర్మానాన్ని శుక్రవారం అందజేసి క్యాంపు వెళ్లిన విషయం తెలిసిందే. కాగా శనివారం కాంగ్రెస్ ఎంపీటీసీ మడక తిరుమల ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు క్యాంపు నుంచి ఇంటికి తిరిగి వచ్చింది. దీంతో అవిశ్వాస తీర్మానంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మొత్తం 9మంది ఎంపీటీసీలకు గాను ఆరుగురు అధికార పార్టీ, ముగ్గురు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం గెలుపొందలంటే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఆరుగురు ఎంపీటీసీలు మద్దతు ఉండాలి కాని క్యాంపులో ఐదుగురు మాత్రమే ఉన్నారు.

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి: జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం వన దేవతలైన సమ్మక్క సారలమ్మల స్ఫూర్తితో పోరాడతామని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రహమాన్ అన్నారు. మేడారం అమ్మవార్ల సన్నిధిలో శనివారం ఇంగ్లిష్ మీడియం ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులను కలిసి గిరిజన యూనివర్సిటీ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణ విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో యూనివర్సిటీల కోసం అనేక ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి సాగర్, నాయకులతో పాటు తదితరులపాల్గొన్నారు.

సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు ఇస్తున్న వైద్యాధికారి

వాజేడు: స్థానిక పీహెచ్‌సీలో క్షయ వ్యాధి గ్రస్తులకు శనివారం వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బియ్యం, న్యూట్రీషియన్ కిట్లు, గుడ్లు, నూనె ప్యాకెట్, కంది పప్పు మొదలైన సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య పర్య వేక్షకుడు కోటిరెడ్డి, రజనీకాంత్, స్టాఫ్ నర్సులు ఉన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్

హన్మకొండ: ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు రావాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల నుంచి నాయకత్వం ఎదగాలంటే అసెంబ్లీ, పార్లమెంటులలో బీసీలు అడుగు పెట్టాలన్నారు. అందుకు అనుకూలంగా చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల కోసం చిన్న రాజ్యాంగ సవరణ జరగాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల మాదిరిగా చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రధాని మోదీ సహకరించాలని కోరారు. వరంగల్‌లోని టెక్స్‌టైల్స్ పార్కును ప్రధాని ప్రారంభించకపోవడాన్ని సురేష్ తప్పుబట్టారు. పీఎం మిత్ర పథకానికి అధికారిక అనుమతులివ్వని రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సాయిబాబా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ ఈదునూరి రాజమొగిళి, నాయకులు యుగేందర్ యాదవ్, శ్రీధర్ రాజు, రవీందర్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


నగదు అందజేస్తున్న స్నేహితులు

ములుగు రూరల్: మండలంలోని జాకారం గ్రామానికి చెందిన రుద్రబోయిన రఘుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాగా 1998 సంవత్సరంలో అబ్బాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అతనితో కలిసి పదోతరగతి చదివిన తోటి స్నేహితులు శనివారం బాధిత కుటుంబానికి చేయూతనిచ్చారు. తలోకొంత పోగుచేసి రూ. 40 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీపాద శ్రీనివాస్, సామంతుల కోఠి, శ్రీనివాస్, మహేందర్, రాజేందర్, కుమారస్వామి, భాస్కర్, రంజిత్‌లతో పాటు జాకారం, కొత్తపల్లి, అబ్బాపూర్‌కు చెందిన మిత్రులు పాల్గొన్నారు.